క్లుప్తంగా

నేడు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని డాక్టర్ రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాలలో ఆది, సోమ వారాలు అండర్ –15 విభాగంలో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పల్నాడు రగ్బీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇ.కృష్ణారెడ్డి, సెక్రటరీ డానియేలు శనివారం తెలిపారు. రాష్ట్రస్థాయి అసోసియేషన్ ద్వారా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుండి 18 బాలుర, 14 బాలికల జట్లు పాల్గొంటాయని వెల్లడించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు టి.శ్రావణ్‌కుమార్, చదలవాడ అరవిందబాబు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆట స్థలాన్ని పరిశీలించారు. సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వెంకట సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపల్ దీన సుదర్శన్ పాల్గొన్నారు.

నేడు అమరజీవి వర్ధంతి

మంగళగిరి: నగర పరిధిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, పార్టీ చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొంది.

విద్యుత్ మరమ్మతులు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని అల్లంవారిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం మరమ్మతులు నిర్వహించినట్లు విద్యుత్ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని పలుప్రాంతాల్లో, ప్రధాన వీధుల్లో 11 కేవీ లైన్‌తో పాటు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్ సిబ్బంది తొలగించారని చెప్పారు. నుదురుపాడు సబ్‌స్టేషన్ పరిధిలో కూడా కొమ్మల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేసినట్లు చెప్పారు.

కోడి పందేల స్థావరంపై దాడి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉండవల్లిలో శనివారం కోడి పందేల స్థావరంపై ఎస్‌ఐ కోటయ్య ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. ఆరుగురుని అదుపులోకి తీసుకుని, కోడి పుంజును, రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కోటయ్య వివరాల మేరకు..ఉండవల్లి అమరావతి రోడ్డులోని శివాలయం పక్కన ఖాళీ స్థలంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు తనిఖీ చేశారు. నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ మెరుగుపడాలి

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల వసతి గృహాల్లోని విద్యార్థులకు ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని అందించాలని, ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్లు చెబుతున్నా వసతి గృహాల నిర్వహణలో ఏమాత్రం మార్పు కనిపించటం లేదని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలోని అన్ని వసతి గృహాల్లోని వార్డెన్లు, ఇతర సిబ్బంది అప్రమత్తతతో వసతి గృహాల సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఇందుకు ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు ముఖ్యంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి, వెల్ఫేర్ కమిషనర్ బాధ్యత తీసుకోవాలని కోరారు.

ఘనంగా తిరుప్పనల్వార్ శోభాయాత్ర

నెహ్రూనగర్: తిరుప్పనల్వార్ తిరు నక్షత్ర జయంతి సందర్భంగా నగరంలోని చుట్టుగుంట నుంచి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీనివాస్ మాట్లాడుతూ తాము హరిదాసులకు పురోహితులుగా సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తున్న మూల వారసులుగా ఉన్నామని తెలిపారు. అక్షయపాత్రను శిరస్సును ధరించుకొని ప్రతి వీధిన హరినామ స్మరణ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హరిదాసు సంఘం నాయకులు కోటి రామాంజనేయులు, శ్రీనివాస్, ఈశ్వరరావు, చెన్నకేశవులు, సాంబశివరావు పాల్గొన్నారు.

శీతాకాలం..
చిన్నారుల రక్షణ ఇలా

- వణికిస్తున్న చలి తీవ్రత
- పిల్లల్లో తగ్గిపోతున్న చురుకుదనం
- సీజనల్ వ్యాధులతో ముప్పు
- తగు జాగ్రత్తలతో వ్యాధులకు దూరం



ఉన్ని దుస్తులు ధరించిన చిన్నారి

తాడేపల్లిరూరల్ : శీతాకాలం చలి చంపేస్తోంది. పది గంటలైనా పొద్దెక్కని మంచుతో పిల్లల నుంచి పెద్దల వరకు వణికిపోతున్నారు. రాత్రిళ్లు చలి తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ఈ వాతావరణం పిల్లల ఆరోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతోంది. పిల్లల రోగనిరోధక శక్తి క్షీణించి ఆరోగ్యం సన్నగిల్లుతోంది. ఫలితంగా పిల్లల్లో చురుకుదనం తగ్గిపోతోంది. అనేక సీజనల్ సమస్యలకు లోనవుతారు. సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరం బ్యాక్టీరియా, జెమ్స్‌తో పోరాడే రోగనిరోధక శక్తిని కోల్పోతుంది. పిల్లలైనా.. పెద్దలైనా చలికాలంలో సరైన డైట్ పాటించడం చాలా ముఖ్యం. అంతేకాక ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు తప్పనిసరి. పిల్లలకు తగినన్ని పోషకాలు, విటమిన్లు, మినరల్స్ ఉండేలా శ్రద్ధ తీసుకోవాలి. ఆకుకూరలు తినడం ద్వారా అధిక మొత్తంలో ఇవి అభిస్తాయి. పాలకూర, మెంతికూర, ఉల్లికాడలు, తాజా వెల్లుల్లిని పిల్లల ఆహారంలో చేర్చడం ఉత్తమం.



చిన్నారులకు ఉన్ని దుస్తులు

సొంత వైద్యం సరికాదు

సాధారణంగా జబ్బు చేసిన ప్రతిసారీ పిల్లలకు యాంటీబయాటిక్ ఇస్తుంటారు. ఫార్మసీకి వెళ్లి యాంటీ బయాటిక్స్ తీసుకురావడం, జలుబు, దగ్గుకు సొంతంగా ఔషధాలు వేయడం సరికాదు. సకాలంలో వైద్యులను సంప్రదించి తగిన వైద్యం అందించాలి.

శీతాకాలంలో ఎక్కువగా దగ్గు, జ్వరం, జలుబు వంటివి వస్తుంటాయి. ఈ కాలంలో వైరస్, బ్యాక్టీరియా సులభంగా వ్యాప్తి చెందుతాయి. ఈ క్రమంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఈ కాలంలో ఎలాంటి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

దుస్తులు: పిల్లలను తీవ్రమైన చలి నుంచి రక్షించి, వారి శరీరం వెచ్చగా ఉండేలా ఉన్ని స్వెట్టర్లు వాడాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే చేతులకు గ్లవ్స్, కాళ్లకు సాక్స్ వేయాలి. శరీరానికి నేరుగా చల్లగాలి తగలకుండా చూసుకోవాలి. వెచ్చదనం తగ్గితే జ్వరం వచ్చే అవకాశం పెరుగుతుంది.

పరిశుభ్రత: పిల్లల గది, ఆడుకునే ప్రదేశాలు, చదువుకునే ప్రదేశం అన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. దుస్తులు, సాక్స్, స్కూల్ బ్యాగ్‌లు, బొమ్మలు అన్నీ పొడిగా, శుభ్రంగా ఉంచాలి.

వ్యాయామం

పిల్లలకు ఎక్కువగా సూర్యకాంతిలో ఆడుకునే అవకాశం ఇవ్వాలి. రెగ్యులర్ వ్యాయామం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రన్నింగ్, జాకింగ్, సైక్లింగ్, స్కిప్పింగ్, లాంటివి చేయించాలి. వ్యాయామం వల్ల శరీరంలో వెచ్చదనం పెరుగుతుంది. ఎక్కువగా చలిగా ఉన్నప్పుడు పిల్లలను బయటకు తీసుకెళ్లొద్దు.

సరైన ఆహారం: పిల్లలకు ఏడాదంతా పౌష్టికాహారం అందించడం అత్యవసరం. తినే ఆహారంపైనే వారి ఇమ్యూనిటీ ఆధారపడి ఉంటుంది. పాలు, పండ్లు, గుడ్లు, కూరగాయలు, ఆకు కూరలను ఎక్కువగా ఇవ్వాలి. పిల్లలు ఆహారం తీసుకునే ముందు చేతులు, కాళ్లు బాగా కడుక్కోమని చెప్పాలి. విటమిన్–సి, ఐరన్, జింక్ వంటి మినరల్స్ అధికంగా ఉన్న ఆహారాన్ని అందిస్తే రోగనిరోధక శక్తి పెంపొందుతుంది.

నీరు: చలికాలంలో చర్మం త్వరగా పొడిబారిపోతుంది. సాధారణంగా ఎక్కువగా దాహం వేయదు. అందుకే పిల్లలు ఎక్కువ నీరు తాగరు. తగినంత నీరు తాగకపోతే చలికాలంలో శ్వాసకోశ ఇబ్బందులు ఏర్పడతాయి. జలుబు, దగ్గు వచ్చే అవకాశం ఉంది. శరీరంలోని వ్యర్థాలు బయటకెళ్లడం కష్టమవుతుంది. అందువల్ల పిల్లలతో నీరు బాగా తాగిస్తూ ఉండాలి. నీరు చర్మాన్ని తేమగా ఉంచి బ్యాక్టీరియాతో పోరాడేలా చేస్తుంది.

నిద్ర: చలికాలంలో పిల్లలు బాగా నిద్రపోయేలా చూడాలి. తద్వారా వారి ఇమ్యూనిటీ బాగా పెరుగుతుంది. శారీరకంగా కూడా పిల్లలు ఎదిగేందుకు నిద్ర చాలా అవసరం. రోజు కనీసం 7 గంటలైనా నిద్రపోయేలా చూడాలి.

టీకాలు: ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్‌తో పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం రాకుండా ఉంటుంది. ఈ వ్యాక్సిన్‌ను పిల్లలకు ఏడాదిలో రెండుసార్లు వేస్తారు. తరువాత ఐదేళ్ల వరకు ఏడాదికి ఒకటి చొప్పున తీసుకోవాలి.

కార్మికులకు న్యాయం చేయాలి



తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కొరపాటి కోటేశ్వరరావు, స్టీరింగ్ కమిటీ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షకు వారు మద్దతు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని, పరిష్కారం అయితే కార్మిక కుటుంబాలు ప్రభుత్వానికి రుణపడి ఉంటాయని, మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో చొరవ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.అంకయ్య, ఎం. ఆశీర్వాదం, కె.ఆదినారాయణ, వై.నాగేశ్వరరావు, ఎం.రహీముల్లా, రమాదేవి, దుర్గా భవాని, నాగమల్లేశ్వరి, బుజ్జి పాల్గొన్నారు.

జేఎంజే కళాశాలలో నాక్ బృందం పర్యటన



తెనాలిఅర్బన్: తెనాలి జేఎంజే మహిళా కళాశాలలో గురు, శుక్రవారాల్లో నాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం పర్యటించింది. నాక్‌కు సంబంధించిన ప్రొఫెసర్ గాదంగి ఇందిర, డాక్టర్ అల్వార్, డాక్టర్ జి.బ్రిందా, డాక్టర్ సెవాస్టియన్ కళాశాలలోని విద్య ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు వంటి వాటిని పరిశీలించి వాటి వివరాలు నమోదు చేయించుకున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ షైనీ మాట్లాడుతూ కళాశాలకు సంబంధించిన అన్ని వివరాలను అందజేసినట్లు శనివారం వివరించారు.

'మాలల మహా గర్జన' వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

మంగళగిరి: గుంటూరులో ఆదివారం జరిగే మాలల మహా గర్జన సభను విజయవంతం చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్, వైస్ చైర్మన్ గుర్రం రామారావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా జరిగే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కుల గణన అనంతరం ఉపాధి ఉద్యోగ అవకాశాలు పరిశీలించి, వర్గీకరణ చేయాల్సి వస్తే అప్పుడు తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అశోక్ కుమార్, మేరుగ నాగేశ్వరరావు, టి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేఏసీ చైర్మన్, వైస్ చైర్మన్లు

విద్యార్థులకు వివేకానందుని జీవితం ఆదర్శం

- రోటరీ 3150–డిస్ట్రిక్ట్ గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి
- మున్సిపల్ హైస్కూలులో వివేకానందుడి విగ్రహం ఆవిష్కరణ
- రూ.17 లక్షలతో నిర్మించిన సైకిల్‌స్టాండ్, డైనింగ్ ప్రారంభం




శిలాఫలకం ఆవిష్కరణలో రోటరీ క్లబ్ అతిథులు

తెనాలి: ప్రతి విద్యార్థి జీవితంలో నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని సాధించేందుకు పట్టుదలతో నిరంతరంగా కృషి చేయాలని రోటరీ 3150–డిస్ట్రిక్ట్ గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి సూచించారు. స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ సంయుక్తంగా బీజీఆర్ మైనింగ్ లిమిటెడ్ కంపెనీ సీఎస్సార్ నిధులతో నిర్మించిన సైకిల్ స్టాండ్, డైనింగ్ హాల్‌ను శనివారం ప్రారంభించారు. సభకు తెనాలి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. జీబీఆర్ కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్, రావి సాంబయ్య మున్సిపల్ పాఠశాల పూర్వ విద్యార్థి చుందూరు విజయఆనంద్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వివేకానందుని విగ్రహాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. శరత్ చౌదరి మాట్లాడుతూ వివేకానందుని జీవితం యువతకు మార్గదర్శకంగా నిలుస్తోందని చెప్పారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ ఎస్వీ రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఒక మొక్కను నాటి పెంచాలని సూచించారు. తమ తల్లిదండ్రులు, పరిసరాల్లోని వారు వనమహోత్సవాల్లో విస్తృతంగా పాల్గొనేలా చొరవ తీసుకోవాలని కోరారు. విజయానంద్ మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలకు తిరిగి సేవ చేసే అవకాశం లభించటం ఎంతో అదృష్టమన్నారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వివేకానందుని నిలువెత్తు విగ్రహం పాఠశాలలో ప్రతిష్ఠించినందుకు ఆనందంగా ఉందన్నారు. రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ అధ్యక్షుడు విసిరెడ్డి బాలకోటిరెడ్డి మాట్లాడుతూ నగరాల్లోనే కాకుండా గ్రామాల్లోని పాఠశాలల అభివృద్ధికి తోడ్పడుతున్నామని తెలిపారు. ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ అన్నే రతన్ ప్రభాకర్ మాట్లాడుతూ రాబోయే రోజులలో తెనాలి, హైదరాబాద్ రోటరీ క్లబ్బులతో మరిన్ని సేవా కార్యక్రమాలకు సహకరిస్తామని చెప్పారు. రోటరీ క్లబ్ తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు మాట్లాడుతూ, తెనాలిలో రూ.17 లక్షలతో మునిసిపల్ బాలుర పాఠశాలలో సైకిల్‌స్టాండ్, డైనింగ్ హాల్ నిర్మించడానికి సహకరించిన జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్, జీబీఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ హైదరాబాద్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. రోటరీ క్లబ్ తెనాలి కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని మౌలాబి ప్రసంగించారు. తొలుత రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి ఆధ్వర్యంలో ఏర్పాటైన రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. నిర్మాణ కమిటీ ఈదర వెంకట పూర్ణ చంద్, మల్లాది అర్జున్, జీవీ నారాయణ, కొల్లి రాజేంద్రప్రసాద్, కాకుమాను ఉపేంద్ర, గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళి, చేతన్ రాజ్ కొటారి పాల్గొన్నారు.

రేపటి నుంచి ధనుర్మాస వ్రత దీక్షా మహోత్సవాలు

తెనాలి: ధనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణదీక్షా మహోత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు శ్రీశరణాగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నరేంద్ర రామానుజ దాసస్వామి తెలిపారు. శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి మంగళాశాసనాలతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. సోమవారం నుంచి జనవరి 13వ తేదీ వరకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌- వీఎస్సార్ కాలేజి రోడ్డులో యర్రంశెట్టి గంగాధర్, యర్రంశెట్టి రమేష్‌బాబు స్థలప్రాంగణంలో ధనుర్మాసవ్రతం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరా రు. కార్యక్రమంలో విష్ణుమొలకల విజయలక్ష్మి- వాలేశ్వరరావు దంపతులు, తన్నీరు సీతారామాంజనేయు లు, జా నకీదేవి, కోటేశ్వరరావు, లేళ్ల ఉమాదేవి, పూష దపు శివయ్య మాస్టారు, తన్నీరు చిన్నమ్మాయి, షణ్ముఖ జ్యూయలర్స్ పెనుగొండ వెంకటేశ్వరరావు, గుదిమెళ్ల సీతారామాచర్యులు, అధ్యాపకుడు కోటిరెడ్డి, విష్ణుమొలకల శ్యాంసుందరరావు, సోమరౌతు నాగేంద్రయ్య, పూషడపు వెంకట్రావు, ఉన్నం పున్నారావు పాల్గొన్నారు.



గోదపత్రికను ఆవిష్కరించిన నరేంద్ర రామానుజ దాసస్వామి

సాగు నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

ఫిరంగిపురం : మండలంలోని 11 కేంద్రాలలో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు తహసీల్దారు జె.ప్రసాద్ రావు తెలిపారు. హౌస్ గణేష్ సాగునీటి సంఘం అధ్యక్షుడిగా బి.అంకారావు, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. పొనుగుపాడు కె.నారాయణ, ఎం.రామచంద్రారెడ్డి, ఆర్.చంద్రమౌళి, షేక్ మస్తాన్ వలీలు ఎన్నికయ్యారు. 113 తాళ్లూరులో ఎ.శంకరరావు, ఎ.రాయన్న, తక్కెళ్ళపాడులో ఐ.పుల్లారెడ్డి, ఎం.శ్రీనివాసరావు, బేతపూడిలో ఎస్.రవికుమార్, టి.శ్రీనివాసరావు, నుదురుపాడులో బి.బాజీ, ఎం.శ్రీనివాసరావు, టి.సాయి ప్రసాద్ రెడ్డి, కె.వెంకట్ రెడ్డి ఎన్నికయ్యారు. ఫిరంగిపురంలో జి.కోటేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, రేపూడిలో ఎ.పున్నారెడ్డి, బి.జోజప్ప, కొండవీడు మేజరులో కె.వీరాంజనేయులు, ఎస్కే ఫిరోజ్ లు ఏకగ్రీవమయ్యారు.



నీటి సంఘాలకు నియామకమైన ప్రతినిధులు



సంఘ సభ్యులతో తహసీల్దారు ప్రసాద్ రావు

సాగు నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలంలో సాగు నీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహించారు. పెదకొండూరులో నిర్వహించిన ఎన్నికలకు తహసీల్దార్ ఐ.సునీత విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని పెదకొండూరు నీటి సంఘం అధ్యక్షుడిగా పల్లెం బాజిబాబు, ఉపాధ్యక్షుడిగా భీమిరెడ్డి శివశంకర్ రెడ్డిలు ఎన్నికయ్యారని తెలిపారు. దుగ్గిరాలలో ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా గొర్నని అనిల్, ఉపాధ్యక్షులుగా గాజులవర్తి మరియమ్మ ఎన్నికయ్యారు. పెరుకలపూడిలో జరిగిన ఎన్నికలు ఏఈ శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా గోగం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా మరీదు రామయ్య ఎన్నికయ్యారు. చినపాలెంలో ఎంపీడీఓ ఎ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా విస్సరపు శేషగిరిరావు, ఉపాధ్యక్షుడిగా సంపతి శివనాగేశ్వరరావు, ఈమనిలో అధ్యక్షుడిగా ఎం.వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా జి.నారాయణ, తుమ్మపూడిలో అధ్యక్షుడిగా నర్రా శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మరీదు శివనాగేశ్వరరావు ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు. ఆయా నీటి సంఘాల పరిధిలోని టీసీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆత్మకూరులో సాగునీటి సంఘాల ఎన్నికలు

మంగళగిరి: ఆత్మకూరులో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. గుంటూరు చానల్ ఆయకట్టు ప్రాంతానికి నిర్వహించిన ఈ ఎన్నికల్లో ఆత్మకూరు గ్రామ నీటి వినియోగదారులు సంఘ అధ్యక్షుడిగా ఇప్పటం గ్రామానికి చెందిన సాధు కొండలరావు, సభ్యులుగా బెల్లంకొండ శ్రీనివాసరావు, గడ్డిపాటి సాంబశివరావు, జవ్వాది హనుమంతరావు, తమ్మిశెట్టి రమణయ్య, మొసలి లీలాకృష్ణ, తాతా వెంకటకృష్ణారావు, బడే రామరావు, ఒంటెద్దు రామచంద్రయ్య, ఒంటెద్దు ఆంజనేయులు, మాన్యం ఏడుకొండలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దుగ్గిరాల తహసీల్దార్ సునీత

బైక్ చోరీల కేసులో నిందితుడి అరెస్టు

పట్నంబజారు: బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో గుంటగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్య వివరాలు వెల్లడించారు. ఇటీవల గుంటూరు నగరంలో బైక్ చోరీలు అవుతున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పక్కా సమాచారంతో ఉమెన్స్ కాలేజీ రోడ్డులో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం, లెనిన్‌నగర్‌కు చెందిన పెరికల సాగర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా, చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. గుంటూరు నగరంలో కొత్తపేట, లాలాపేట, పాతగుంటూరు, ఖమ్మం, ప్రాంతాల్లో చోరి చేసిన 11 ద్విచక్ర వాహనాలతోపాటు, మూడు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 11 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

వర్గీకరణ, క్రీమిలేయర్ రాజకీయ కుట్ర

నెహ్రూనగర్: గత ఏడు దశాబ్దాలుగా స్వతంత్ర భారతదేశంలో అగ్రవర్ణ రాజకీయ కుట్రలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలు నిరంతరం దగా పడుతూనే ఉన్నారని లోక్ తాంత్రిక్ జనతాదళ్ రాష్ట్ర అధ్యక్షులు బూరగ రత్నం ఆరోపించారు. శనివారం లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్గీకరణ, క్రీమిలేయర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్దాలుగా అన్నదమ్ముల్లా కలిసి ఉన్న దళితులను కేంద్రంలోని ఎన్డీఏ కూటమి అనుకూల ఉన్నత న్యాయస్థానం వర్గీకరణ చేయటం ముమ్మాటికీ రాజకీయ కుట్రేనని ఆరోపించారు. వర్గీకరణ నిజంగా చేయదలిస్తే 50% ఉన్న మనువాద కుల ఓసీలను ఎమ్మెల్యే, ఎంపీలను వర్గీకరించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ పేరుతో 97% శాతం పైగా ఉన్న బడుగుబలహీన వర్గాల ప్రజలను మరొకసారి వంచించటమేనని తెలిపారు. వర్గీకరణకు వ్యతిరేకంగా అగ్రవర్ణ పార్టీల కుట్రలను బహిర్గతం చేసేందుకు ఆదివారం మూడు గంటలకు స్థానిక నల్లపాడులో పెద్దఎత్తున నిర్వహించే బహిరంగ సభకు వివిధ రాజకీయ పార్టీలు, దళిత, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఈ సమావేశంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నల్లపు నీలాంబరం, మంచాల జోసెఫ్, దొడ్డా రవీంద్ర, బత్తుల అనిల్ కుమార్, ఎస్. కోటేశ్వరరావు, కూరపాటి సింహరాయులు, సుధాకర్ పాల్గొన్నారు.



లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



నగరంపాలెం: శ్రీ వాసవీ మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక ఏలూరు బజార్‌లోని శ్రీ కోదండరామ మందిరం వద్ద శనివారం శ్రీ అయ్యప్పస్వామి నవదశ (19వ) మహా పడిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పద్మనాభన్ నంబూద్రి (పప్పాస్వామి) ఆధ్వర్యంలో అష్టద్రవ్య మహాగణపతి హోమం, అయ్యప్ప స్వామికి 18 రకాల ద్రవ్యాలు, నదీ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పలు, భవానీలు, భక్తులకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు గ్రంధి నాగవెంకటమల్లేశ్వరరావు, కార్యదర్శి తడికమళ్ల మణికంఠ, కోశాధికారి నాళం శివప్రసాద్, ఉపాధ్యక్షులు జూలూరి హేమాంగద గుప్త, దేవతి శివకుమార్, సహ కార్యదర్శులు గర్రె వెంకటచంద్రశేఖర గుప్త, పువ్వాడ సురేష్, ఉప కోశాధికారి పాదర్తి ఉమామహేశ్వరరావు, సభ్యులు గోపవరపు ఓంప్రకాష్, నూనె అంకమ్మగుప్త పాల్గొన్నారు.